కథ

# నిధి

పోల్కంపల్లి శాంతాదేవి



నిన్న ముత్యాల వీరన్న చనిపోయాడట.

ఎవరో చెప్పారు.

నాకు పది పన్నెండేళ్ళనాటి సంగతులు గుర్తువచ్చాయి.

మా నాన్నగారికి ఎక్కడిదో ముదనష్టపు ఆస్తి కలసిరావడంవల్ల ఉన్న ఊరు వదిలేసి పెట్టేబేడ్లతో కాపురం పెట్టాల్సి వచ్చింది.

మా అక్కయ్య భర్త ఉద్యోగరీత్యా అప్పుడు ఆ ఊళ్ళోనే ఉన్నారు. మా అక్కయ్య నిత్యరోగి. ఆవిడ కెప్పుడూ మంత్ర తంత్ర ఉపచారాలు జరుగుతూ ఉండేవి. మా అక్కయ్య పుణ్యమా అని చాలామంది మంత్రగాళ్ళు లాభపడ్డారు.

ఆ సందర్భంగా పరిచయమైనవాడే ముత్యాల వీరన్న.

మా బావగారి ఆహ్వానం అందుకొని ఒకరోజు వీరన్న దిగాడు. అతడి చేతిలో ఒక పెద్ద ట్రంకుపెట్టె ఉంది. ఆ పెట్టెలో ఉన్న సరంజామా ఏమిటో మా ఊహకందలేదు.

"ఏమైనా వస్తువులు కావాలా?" ఒకటి రెండు మాటలయ్యాక అడిగారు మా బావగారు.

"రాత్రికి పూజ పెడతాను. అంబ ఏం పలికితే అది చేయాలి," అన్నాడు వీరన్న.

రాత్రి అవుతూండే వీరన్న స్నానం చేశాడు. ముడుతలతో ఉన్న పాత పట్టు పంచ కట్టుకొన్నాడు. పెద్ద కుంకుమ బొట్టు పెట్టుకున్నాడు. పూజకు ఒక స్థలాన్ని ఎన్నుకొని, అలికి ముగ్గు పెట్టమన్నాడు. అతడు చెప్పినట్టు చేశాం.

ట్రంకు పెట్టె తెరిచాడు. అందులోంచి మూరెడు ఎత్తున్న దేవీ విగ్రహం, కంచుది తీశాడు. పీటమీద అమర్చాడు. విగ్రహం ముఖంనిండా, విగ్రహానికి కట్టిన పట్టుచీరనిండా కుంకుమ, పువ్వులు నిండి ఉన్నాయి.

పెట్టెలోంచి గుప్పెడు చేమంతి పువ్వులు తీసి మా అక్కయ్య చేతికిచ్చి, "ఇవి వారంరోజుల నాటివి" అన్నాడు వీరన్న.

ఆవి ఆ రోజు పువ్వుల్లాగే ఎంతో తాజాగా ఉన్నాయ్.

ముందుముందు ఇంకా ఏమేం మహిమలు చూస్తామో అనుకొన్నాం.

దేవికి అటు ఇటు కలశాలలో దీపాలు వెలిగించబడ్డాయి.

తలుపులు మూసిన ఆగదిలో మస్తాన్ దర్బార్ ఆగర్బత్తీల వాసన నిండిపోయింది.

దేవిమీదికి పువ్వులు, అక్షింతలు చల్లుతూ, దేవిని స్తుతిస్తూ పూజ ప్రారంభించాడు వీరన్న. విగ్రహంమీదే తీక్షణంగా దృష్టినిలిపిన అతడు నెమ్మదినెమ్మదిగా ఊగడం మొదలుపెట్టాడు. ఇంకొంచెంసేపటి తరువాత చలికాలంలో చన్నీళ్ళస్నానం చేసినవాడిలా వణకసాగాడు. వణుకుతూనే పెద్దగా కేకపెట్టాడు. పెడుతూనే జుట్టుముడి విడదీసి తల విదిలించాడు. కుడిచెయ్యి పిడికిలిగా మార్చి రొమ్ముమీద గట్టిగా గుద్దుకొన్నాడు.

ఆ గుద్దుకు ఎదబొమికలు చూరుచూరు కావలసిందేగాని ఎందుకో కాలేదు.

మధ్య మధ్య కేకలుపెడుతూ, గుండెలమీద గుద్దుకొంటూ సరిగా అర్థం కాని పదాలతో ఏవో సంకేతపు మాటలతో, ఒకవిధమైన యాసతో 'బ్రాహ్మణ బాలింత బావిలోపడి పిశాచమై మా అక్కకు పట్టిందని, అది చాలా శక్తివంతమైందని, మంత్రగాళ్ళకు తిరుగు మంత్రం వేయగలదని, అది మనిషిని తీసుకొనే వెళ్ళిపోవా లనుకొంటున్నదని చెప్పాడు.

మా ముఖాలు వివర్ణమైపోయాయి.

ఇంతట్లో మా పెద్దన్నయ్య చేతులు కట్టుకొని అడిగాడు. "మాకి ఇల్లు సరిగా అచ్చిరాలేదు. అంటేది అంటకుండా, ముట్టేది ముట్టకుండా ఉంది. ఈ ఇంట్లో ఉండేది దయ్యమా? భూతమా? లేక మా గ్రహచారమా?"

మా నాన్నగారు ఈ ఊళ్లో కాపురం పెట్టవలసివచ్చాక ఈ పాత ఇంటిని నాలుగు వందలకు కొన్నారు. అది ఒక

రెడ్డిగారిది. కొంటున్నప్పుడు ఎవరూ చెప్పలేదు గాని కొని ఇంట్లోకి వచ్చాక నలుగురూ నాలుగు మాటలు చెప్ప సాగారు. ఈ ఇల్లు అంతమంచిది కాదట. ఆ రెడ్డిగారు ఈ ఇంట్లో ఉన్నన్నాళ్ళు చాలాకష్టాలు పడ్డారట. ఈ ఇల్లు వదిలేసి కొత్తఇల్లు కట్టుకొని వెళ్ళిపోయాక ఇప్పుడు బాగుపడ్డారట.

ఏదో పిశాచం కోరోళ్ళబావి (మా ఇంటికి అరఫర్లాంగు దూరంలో ఉన్న ఊరబావి) నుండి అర్ధరాత్రివేళ బయ ల్దేరి మా ఇంటిముందున్న మరో రెడ్డిగా రింట్లోంచి మా ఇంట్లోకి వస్తుందని, ఆ ఇంట్లో ఉన్నవాళ్లకి యశస్సు లేదని కూడా చెప్పారు.

మా చిన్నన్నయ్యకు ఒక ఫ్రెండు ఉండేవాడు, రామిరెడ్డిఅని. అతడికి పిల్లి కళ్ళు (బూడిదరంగు) ఉండేవి. అతడి కళ్ళకు ఎలాంటిగాలైనా కనిపించేదట. అతడు మా ఇంటికి వచ్చి కూర్చొ న్నప్పుడు ఒకటిరెండుసార్లు అతడి ముందునుండే వెళ్ళిందట ఓ తెల్లచీర కట్టుకొన్నదీ, తల విరగబోసుకొన్నదీ. "చూడు చూడు" అంటూ మా అన్న య్యకు చూపెడితే మా అన్నయ్య తన కేపీ కనిపించ లేదన్నాడు

మొత్తంమీద ఆ ఇంట్లో శక్తిలాంటిది ఉన్నదని మావాళ్ళ మనసుల్లో నాటుకు పోయింది. అరలక్ష విలువనేసే పొలాలు కలిసివచ్చినా ఒకోరోజు తినడానికి తిండి ఉండేది కాదు. ఒకరిమాట ఒకరికి పడేది కాదు. మనుషులు ఎప్పుడూ అస్థిమితంగా ఉండేవాళ్ళు.

వీరన్న మా పెద్దన్నయ్య ప్రశ్న వింటూనే ఆర్భాటంగా కేకలు వేశాడు గుండెలమీద సత్తువకొద్దీ గుద్దుకొన్నాడు.

కేకలమధ్య చెప్పాడు ఆ ఇంట్లో ధనశక్తి ఉందని. వసారాలో రోటిక్రింద రెండు గంగాళాలలో వెండిమొహరీలు, బంగారుకడ్డీల నిధి పాతరవేసి ఉందని; అది శక్తిగామారి తిరుగుతోందట. మంత్రబలంతో శక్తిని కట్టివేసి నిధిని పైకి తీస్తాడట!

మావాళ్ల కళ్లు ఆశతో మెరిశాయి.

మా పెద్దన్నయ్యకు నిధినిక్షేపాలండే పెద్ద పిచ్చి. ఏ పాత గోడల్లోనో తనకు రాగిబిందె దొరకకపోతుందా అని కలలు కనే మనిషి. పల్లెటూళ్ళలో సామా న్యంగా పాడుపడిన ఇళ్ళు, పడిపోయిన గోడలు, మరుగుదొడ్లు అవుతుంటాయి. మరుగుదొడ్డికివెళ్ళి ఓ గుండ్రాయి పట్టుకు వచ్చి నలుగురు కూర్చొనేచోట గూట్లో ఉంచాడు దాన్ని మా పెద్దన్నయ్య!

"ఏంస్వామీ? గూట్లో గుండ్రాయి పెట్టారు?" చూచినవాళ్ళందరి నోటా ఈప్రశ్న తప్ప "బంగారు ముద్ద ఇక్కడ పెట్టారేమిటి?" అని ఎవరూ అనలేదు పాపం!

ఈ సందర్భంగా నాకో కథ చెప్పా లనిపిస్తూంది.

ఒక కోమటి పాతఇంటిని కూల ద్రోసి క్రొత్తఇల్లు కట్టుకుంటూండే ఒక రాగిబిందె దొరికిందట. బిందెలో పాములూ, మంద్రకప్పలూ ఉన్నాయట. కోమటి భయపడకుండా పట్టుకెళ్ళి, తన దుకాణంలో తేళ్ళనీ, పాములనీ తోర ణంలా కట్టాడట. దుకాణానికి వచ్చిన వాళ్ళందరూ "పాముల్నీ, తేళ్ళనీ ఇలా కట్టుకొన్నావేమిటి, శెట్టీ?" అని అడిగే వారు.

శెట్టి చిరునవ్వినవ్వి ఊరుకునేవాడు.

అలా ఉండగా ఒకరోజు ఒకతడు వచ్చి, ఆ తోరణాన్ని ఆశ్చర్యంగా చూశాడు. "ఇక్కడ ఈ నగలన్నీ ఎందుకు కట్టావు, శెట్టీ?" అంటూనే, "ఈ మాటిలో ఎర్రరాళ్ళు ఎంత ఎర్రగా మెరిసిపోతున్నాయో!" అని ఒకదాన్ని చేతిలోకి తీసుకొన్నాడు.

అంత సేపూ తెలుగా కనిపిస్తున్నది అతడు చేతిలోకి తీసుకోగానే అది ఎర్ర రాళ్ళ మాటీగా మారిపోయి కనిపించింది శెట్టికి. "నీ కోసమే ఇవి ఇక్కడుండాను, నాయనా! తీసుకో" అంటూ ఆనందంతో తేళ్ళనీ, పాముల్నీ అతడిముందు కుప్ప బోశాడు. అతడి స్పర్శతో తేళ్ళు పాములు వడ్డాణాలు, వంకీలుగా మారి పోయాయి.

వీరన్నను ఆవహించిన శక్తి ఏదో దిగిపోవడంతో అమాంతం సొమ్మ రోగం వచ్చినవాడిలా నేలమీద విరు చుకుపడ్డాడు. బిగుసుకొన్న పిడికిళ్ళు అయిదు నిమిషాలకు విడివడ్డాయి. తరు వాత అతడు మామూలుగా లేచి కూర్చొ న్నాడు. అంబ ఏం పలికిందని అడి గాడు. మా వాళ్ళు చెప్పారు.

వీరన్న గంభీరంగా లేచి ఇల్లంతా కలియదిరగసాగాడు. మేం అనుస రించాం. అతడు తిరిగి తిరిగి చుట్టూ గోడల్ని (మట్టిగోడలు)చేతితో తాటిస్తూ, ఆ శబ్దాన్ని చెవిఒగ్గి వింటూ చివరికి అంబపలికిన రోటిదగ్గరికి వచ్చి రెండు క్షణాలు చూచి తల పంకించాడు ఏదో గ్రహించినవాడిలా.

తరువాత దాన్ని వెలికి తీసే కార్య క్రమం వివరించాడు.

తను మంత్రాలు చదువుతూండగా ఒకానొక బిగుదినం త్రవ్వకం ప్రారం భించాలి! గంగాళాలుబయట పడ్డ తరు వాత ఇద్దరు కన్నెపిల్లలు చేంతాడుతో పైకి లాగాలి. అవి బయటికి తీశాక ఒక గొఱ్ఱెపిల్లను తలకోసి అందులో పడేసి పూడ్చేయాలి.

మా పెద్దన్నయ్యకు ఇద్ద రాడపిల్లలు ఉన్నారు. వాళ్ళు చేంతాడు చెరోపక్క పట్టుకు లాగడానికి నిర్ణయమైంది.

తరువాత వీరన్న గదిలోకి వెళ్ళి అంబకు నివేదన అంటూ సారాయంసీసా నోటికి పట్టాడు.

ఆరోజు రాత్రి మూడు గంటల వరకూ తన జీవితంలో నిధులు పైకి

తీసిన సంఘటనలు వివరిస్తూనే ఉన్నాడు వీరన్న.

మేం చెవులు చాటలు చేసుకొని ఊపిరి బిగబట్టి వింటున్నాం.

"నల్లకుంటలో దొరలు పొలాలు పండడంలేదని, ఇంట్లో అందరికీ ఎప్పుడూ రోగాలూ రొచ్చులతో మూలుగుతుంటారని, రాత్రిపూట ఎక్కడి నుండో రాళ్ళువచ్చి ఇంట్లో పడుతుంటాయని చెప్పి నన్ను తీసికెళ్ళారు. వెళ్ళి అంజనంవేసి చూశాను. వాళ్ళ ఇల్లు ఒక కోటలా ఉంటుంది. సుమారు నాలుగెకరాలు ఉండే పెరటిలో తూర్పువైపున కోలెడులోతులో హౌజు కనిపించింది. వాటినిండా బంగారు మొహరీలు ఉన్నాయ్. దానికి కాపలాగా ఒక శక్తి ఉంది. ఆ శక్తే వాళ్ళనలా వేదిస్తోంది.



"ఆ నిధిని పైకి తీశాక అందులో పావు భాగం నాకు అప్పగించడానికి ఒప్పుకొన్నారు. ఆ గోతిలో వేసి పూడ్చడానికి ఒక మనిషిని చూచుకొమ్మని చెప్పాను. సరే, అమావాస్య, ఆదివారం రోజు రాత్రి త్రవ్వకం మొదలైంది. కోలెడులోతు తవ్విన తరువాత హౌజు అంచులు తగిలాయి. గునపాలు కణీల్ మన్నాయి. మంత్రంతో శక్తిని కట్టివేశాను. హౌజుమూత తీశాను. అన్నీ బంగారు మొహరీలు! తొందర తొందరగా గోనెసంచీలలో నింపాం. "మనిషి ఏడీ?" అన్నాను పని పూర్తి అయ్యాక.

వాళ్ళున్నది నలుగురు. ఇద్దరు పనివాళ్ళు. ఇద్దరు ఇంటివాళ్ళు. వాళ్ళు ఏవో చేతి సైగలు చేసుకొన్నారు. చటుక్కున అపాయం తెలిసిపోయింది. కాలికి బుద్ధి చెప్పాను. ఆ చీకటిరాత్రి చెట్లలో పొలాల్లో పడి పరిగెత్తాను. వాళ్ళు కొంత దూరం వచ్చి ఆగిపోయారు."

ఆ మిగిలినరాత్రి మాకెవరికీ నిద్ర పట్టలేదు. రోటిక్రింద మొహరీలతో, బంగారు కడ్డీలతో ఉన్న గంగాళాలే మా మనస్సులో మెదులుతున్నాయి. అప్పటికప్పుడు తవ్వి చూచుకోవాలన్నంత ఉబలాటంగా ఉంది. నిధి దొరికాక ఒక్కసారే బయటపడకుండా నెమ్మది నెమ్మదిగా ఎలా పైకి తీయాల్సింది ఆలోచిస్తున్నారు మా అన్నయ్యలూ, మా నాన్నగారూ!

మరునాడు ఉదయం మా వాళ్ళు అడిగారు వీరన్నను 'ఇంట్లో ధనం ఉందని నిర్ధారణ కావడానికి ఏం గుర్తులున్నా'యని.

నాలుగు కొబ్బరికాయలు తెప్పించమన్నాడు వీరన్న.

నాలుగు కొబ్బరికాయలు తెప్పించారు మావాళ్ళు. వాటిని చేతిలోకి తీసుకొన్నాడు వీరన్న. ఏదో మంత్రించాడు. వాటిని ఇంట్లో నాలుగుమూలలా గంప క్రింద ఉంచమని ఇంట్లో నిధి ఉన్నది నిజమైతే కొబ్బరికాయలు నార తీయకుండానే లోపలే ముక్కలుముక్కలై పోతాయని, అబద్ధమైతే కొబ్బరికాయలు ఏం కావని చెప్పాడు.

వీరన్న వెళ్ళిపోయాడు ట్రంకు పెట్టెతోసహా.

రాత్రి గడిచాక ఉదయం మా వాళ్ళు ఆత్రుతతో కొబ్బరికాయలు నారతీసి చూశారు. కొబ్బరికాయలు పగుళ్ళు విచ్చి కనిపించాయి. మావాళ్ళ ఆనందం అంతా ఇంతా కాదు.

వీరన్న వెళ్ళిన వారంరోజుల తరువాత మళ్ళీ పిలుచుకువచ్చారు. ఈసారి ట్రంకుపెట్టె తీసుకురాలేదతడు. ఈ రోజు నిధి తీసే తతంగం పెట్టుకోలేదు. దానికి సమయం ఇంకా రాలేదన్నాడు. మా అక్కయ్యకు ఉపచారం మొదలు పెట్టాడు.

నేలమీద పిండితో దెయ్యంబొమ్మ వేశాడు. మా అక్కయ్యను ఆ బొమ్మ మీద కూర్చోబెట్టాడు. ఆ తరువాత చేసిన పనులు నాకు సరిగా జ్ఞాపకంలేవు ఇన్నాళ్ళ తరువాత. మొత్తానికి మా అక్కయ్యను ఆవహించిన పిశాచాన్ని కాల్చి భస్మం చేశానన్నాడు.

మరునాడు వెళ్ళిపోయాడు ఊరికి.

మా వాళ్ళు వారానికీ, పదిరోజులకీ వెళ్ళి వీరన్నను కలుస్తూనే ఉన్నారు. ఎప్పుడు కలిసినా ఇప్పుడుకాదనీ, తన ఆరోగ్యం సరిగాలేదని, నిక్షేపం పైకి తీసే సమయంలో తను ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా గంగాళాలకి కాపలాఉన్న శక్తి తనను మింగివేస్తుందనీ చెప్పాడట.

మా వాళ్ళకు ఆలస్యమౌతూన్నకొద్దీ ఆత్రుత పెరిగిపోతున్నది.

మా ప్రాంతంలో ప్రశ్న చెప్పడంలో పేరు సంపాదించుకొన్న సిద్ధాంతి ఒకాయన్ని ప్రశ్న అడగడానికి వెళ్ళారు మా వాళ్ళు. వీళ్ళనుచూస్తూనే ద్రవ్య సంబంధమైన సమస్యమీద అన్నాడట సిద్ధాంతి.

మావాళ్ళు సంతోషంతో అవునన్నారు.

ఆయన కొద్దిసేపు ఏదో గుణించుకొని, మీ ఇంట్లో తూర్పుదిశగా ద్రవ్యం భూస్థాపితమైంది. కాని, అది మీకు దక్కదు. ఆ నిధికి త్రాచుపాము కాపలా కాస్తోంది. దాని వారసులైనవారికి దానంతట అదే దక్కుతుంది. మీకు ప్రాప్తం లేదు" అని తేల్చి చెప్పేశాడు.

ఇంట్లో ద్రవ్యం వుందని తెలిశాక ఊరుకోవడం ఎవరికి సాధ్యం? వీరన్నని ఎన్నిసార్లు పిలిచినా అతడు ఏదో సాకు చెప్పి తప్పించుకుంటున్నాడు.

ఇక లాభంలేదని ఓరోజు రాత్రి ధనం త్రవ్వడానికి సిద్ధమయ్యారు మా అన్నయ్యలు ముగ్గురూ. వీధి తలుపులు మూసేశారు. రోటిపక్కగా అగరొత్తులు వెలిగించి పెట్టారు. ధనం బయటపడ్డాక కొట్టడానికి కొబ్బరికాయ తయారుగా ఉంచుకొన్నారు.

ముందు రోటిచుట్టూ ఉన్న బండలు పీకారు.

రెండు అడుగుల పొడవూ, వెడల్పు ఉన్న పెద్ద రోలది. భూమిలో దాని అడుగు తాకేప్పటికే మా అన్నయ్యల చేతులకు బొగ్గలువచ్చాయి. చేతులు మాంసం ముద్దల్లా అయ్యాయి. స్నానం చేసినట్టుగా స్వేదంతో తడిసిపోయారు. ఎగరొప్పటం మొదలుపెట్టారు. అయినా ఆపని రాత్రే అయిపోవాలి. తెల్లవారితే వాళ్ళు వీళ్ళు వస్తుంటారు. రహస్యం బయట పడిపోతుంది.

పదిమంది కలిస్తేగాని పైకి పెకివించడానికి వీలుకాని రోటిని ముగ్గురే తీయడానికి వాళ్ళు పడినశ్రమ, ఆయాసం వర్ణించడానికి నాకు మాటలు కరువేతున్నాయి. మొత్తానికి రోటిని పైకి తీశారు గాని, పైకి పోర్లించడంలో రోలు కాస్తా బోర్లపడింది.

"ఆ దొరికేది ఎంత నిజమోకాని రోలు బోర్లాపడింది. ఇంటికి అరిష్టం!" అంటూ మొత్తుకొంది మా అమ్మ.

మట్టితీసి ఇవతల పోస్తున్నారు. మట్టి గుట్టలాగా పెరిగిపోతున్నది.

చెమటలు తుడుచుకొంటూ, ఆగి ఆగి అలుపు తీర్చుకుంటూ తవ్వుతూనే ఉన్నారు. గునపం ఖంగుమంది. పరిశీలనగా చూస్తే మొరసురాయి! ఇంకాస్తా తవ్వేప్పటికి ఒక పందికొక్కు సొరంగం బయటపడింది.

తొలికోడి కూసింది. అగరొత్తుల పొట్లం ఖాళీ అయింది. కొబ్బరికాయ కొట్టే అవసరం కలుగలేదు. కోలన్నర తీసిన గోతిలోంచి పైకి వచ్చి పక్కల మీద పడిపోయారు మా అన్నయ్యలు. మూడురోజుల దాకా పక్కవదిలితే ఒట్టు. భుజాలనొప్పులతో, నడుంనొప్పులతో ఒళ్ళంతా నుగ్గునుగ్గు అయిపోయి జ్వరం వచ్చిన మనుష్లా పక్కల్ని కరుచుకుపోయారు.

ఆ తరువాత ఒకరోజు వీరన్నదగ్గరికి వెళ్ళి. "గంగాళాలు దొరకలేదూ, పాడూ దొరకలేదు" అని చెప్పారు మా వాళ్ళు,

"మంత్రగాడు దగ్గర లేకుండానే ఎలా దొరుకుతుందనుకొన్నారు ద్రవ్యం?" అని కోప్పడ్డాడట వీరన్న

ఏమైనా మా అన్నయ్యలకు ఆశ చావలేదు. సిద్ధాంతి చెప్పిన సూచనల ప్రకారం తూర్పుదిశగా వంటింట్లో పొయిలపక్కగా ధనం ఉండాలి. ఓ రోజు మధ్యాహ్నం పీకిపడేసి గజమున్నరలోతు తవ్వి చూశారు గోడలచుట్టూ.

ఆ తరువాత చాలా రోజులవరకూ పందికొక్కుల్లా ఇల్లంతా తవ్వుతూనే ఉన్నారు. ధనం దొరకలేదు గాని, పాతిపెట్టిన టెంకాయలూ, మేకులూ, జీడిగింజలున్న పిడతలూ బయట పడ్డాయి.

ఒకరోజు మా ఇంటిముందుకు వచ్చిన గోసాయిని అడిగారు ఇంటిగురించి

నిధి నిక్షేపాలు ఏం లేవని చెప్పాడు గోసాయి.

"ఈ ఇల్లు మంచిదికాదు. ఈ ఇల్లు వదిలేసి మరోస్థలం చూచుకొని వెళ్ళిపోండి. కొన్నితరాలక్రితం ఒక వితంతు స్త్రీ గర్భవిచ్ఛిత్తి చేసుకొని, పిండాన్ని ఈ ఇంట్లోనే పూడ్చిపెట్టింది. భ్రూణహత్య జరిగిన స్థలం ఎవరికీ శ్రేయస్సు కాదు!"

ఈ ఇంట్లో ద్రవ్యం ఉన్నట్టు కొబ్బరికాయల పరీక్షలో తేలినసంగతి గోసాయికి చెప్పారు.

"అది మంత్రగాడి తంత్రం తప్ప ఏంకాదు. కొబ్బరికాయపీచు తీయక ముందు నాలుగు బియ్యంగింజలు దాని జుట్టులో ఇరికించండి. గంట తరువాత పీచుతీసి చూడండి. కొబ్బరికాయ ముక్కలై కనిపిస్తుంది!" చిరునవ్వుతో సెలవిచ్చాడు గోసాయి.

ఈ కథ చెబుతున్న కాలానికి మా నాన్నగారు చనిపోయారు.

సంసారం పూర్తిగా చితికిపోయింది. మా ముగ్గురు అన్నయ్యలూ తలోదారి అయిపోయారు. ఆ ఇల్లు పడిపోయి మొండిగోడలు నిలిచాయి! ఆ మొండి గోడల్లో ధనం ఉందని ఇప్పటికీ మా వాళ్ళకి గాఢమైన నమ్మకం!...చెప్పడం మరిచాను!

మా అక్కయ్య ఆరోగ్యం ఇప్పుడూ అలాగే ఉంది. ఒకరోజు లేచి తిరిగితే రెండురోజులు పడకవేస్తూ ఉంటుంది!

---